
సాక్షి
తిరుపతి

సోమవారం । 6 । అక్టోబర్ । 2025



ఎండలో భక్తులు

శ్రీకాళహస్తీశ్వరాలయం వద్ద భక్తుల కోసం ఏర్పాటు చేసిన షెడ్లతో కొందరు వాహనాలను పార్క్ చేస్తున్నారు. - 8లో



దేవుడికే శఠగోపం!

చంద్రగిరి మండలం మామండూరు వద్ద కాటమరాజు ఆలయ మాన్యం భూమిని కొందరు కబ్జా చేస్తున్నారు. - 8లో



వీసీ..పేచీ!

ఎస్వీయూకి వైస్ చాన్సలర్ నియామకంపై ప్రభుత్వం శీతకన్ను వేసింది. ఇన్‌చార్జి వీసీతోనే నెట్టుకొస్తోంది. - 8లో

మమ్మల్ని ఆపేదెవడ్రా?


తనపల్లె మార్గంలో చేపట్టిన భవన నిర్మాణం


కొండను తొలిచిన మట్టితో ఏర్పాటైన వెంచర్


ఆక్రమణకు గురైన అంజేరమ్మ ఆలయం వెనుక వైపున ఉన్న కొండ

కరిగిపోతున్న కొండలు.. గుంతలమయంగా స్వర్ణముఖి

- ఆక్రమణలకు గురవుతున్న భూములు
- మామూళ్ల మత్తులో అధికారులు


తిరుపతి రూరల్ మండలం తనపల్లి మార్గంలోని స్వర్ణముఖి నదిని పూడ్చివేస్తున్న దృశ్యం


తనపల్లి మార్గంలో నదీ పరీవాహక ప్రాంతాన్ని పూడ్చివేస్తున్న దృశ్యం

సాక్షి ప్రతినిధి, తిరుపతి:తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో కూటమి నేతలు చెలరేగిపోతున్నారు. అందిన కాడికి అడ్డంగా దోచేస్తున్నారు. మామూళ్లకు అలవాటుపడ్డ అధికారులను బుట్టలో వేసుకుని బురిడీ కొట్టిస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండానే కొండలను పిండి చేస్తున్నారు. రాత్రీపగలు తేడాలేకుండా టిప్పర్లు, ట్రాక్టర్లు పెట్టి మట్టి, గ్రావెల్, ఇసుక, సిలికా, క్వార్ట్జ్‌ను సరిహద్దులు దాటిస్తున్నారు. దగ్గర్లోని వెంచర్లకు తోలుతూ జేబులు నింపుకుంటున్నారు. ఇది చాలదన్నట్టు ఖాళీ జాగా కనిపిస్తే పాగా వేసేస్తున్నారు. అడ్డుచెప్పిన వారిపై దాడులకు తెగబడుతున్నారు. అధికారులను అడ్డం పెట్టుకుని తప్పుడు రికార్డులు సృష్టించి స్వాధీనం ప్రభుత్వ భూములు చేసుకుంటున్నారు. అటు కుప్పం నుంచి ఇటు గూడూరు వరకు వారి ఆగడాలకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది.

చిత్తూరు కేంద్రంగా భారీగా గ్రానైట్ దందా సాగుతోంది. చిత్తూరు, బంగారుపాళెం, యాదమర్రి, పాలసముద్రం, వెదురుకుప్పం, శ్రీరంగరాజపురం, గంగాధరనెల్లూరు, కుప్పంలో కొండల్లోని గ్రానైట్ సంపదను కొల్లగొడుతున్నారు. చంద్రగిరి నియోజకవర్గం తిరుపతి రూరల్ పరిధిలోని కుంట్రపాకం సర్వే నం.599 ఎగువ చెరువులోని బంకమట్టిని భారీ యంత్రాలతో తోడి ఇటుక బట్టీలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. చెరువులోని నీటిని కూడా ఇటుక బట్టీలకు వాడుకుంటున్నారు. రైతులు అధికారులకు సమాచారం ఇచ్చినా పట్టించుకోలేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


బంగారుపాళెంలో కొండను తవ్వేస్తూ.. (ఫైల్)

కనుమరుగవుతున్న స్వర్ణముఖి

తిరుపతి రూరల్ మండలం, అవిలాల రెవెన్యూ వేదాంతపురం పంచాయతీ పరిధిలోని స్వర్ణముఖి నదిని యథేచ్ఛగా ఆక్రమించేస్తున్నారు. 2012 నుంచి 2019 వరకు సర్వే నం.504/7 నదీ పోరంబోకు భూమిలో ఇసుకను తోడి విక్రయించి ఆపై పెద్ద ఎత్తున నిర్మాణాలు చేపట్టారు. ఫలితంగా స్వర్ణముఖి నది పూర్తిగా కనుమరుగైంది. ప్రస్తుతం ఉన్న కొద్ది పాటి నదిని సైతం పూడ్చివేసి ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నారు. ఇదంతా అధికారుల కనుసన్నల్లోనే సాగుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు.

కరిగిపోతున్న అంజేరమ్మ కనం..

వడమాలపేట మండల పరిధిలోని అంజేరమ్మ ఆలయానికి ఆనుకుని ఉన్న కొండ కరిగిపోతోంది. ఇప్పటికే ఆలయం వెనుక ఉన్న కొండను యంత్రాలతో తొలిచి ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి తన భూమిని చదునుచేసుకున్నారు. ప్రస్తుతం చుట్టూ ప్రహరీ గోడ నిర్మించి రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం సిద్ధం చేశారు. అదే విధంగా ఆలయం వెనుక ఉన్న కొండను తవ్వి గ్రావెల్‌ను తరలించకపోవడంతో పాటు.. ఆక్రమించి మామిడి చెట్లు పెట్టేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఈ అక్రమాలు స్థానిక అధికారులకు తెలిసినా మామూళ్ల పుచ్చుకుని చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ అక్రమాలపై ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

న్యూస్‌రీల్

నేడు కలెక్టరేట్‌లో గ్రీవెన్స్

తిరుపతి అర్బన్: కలెక్టరేట్‌లో సోమవారం గ్రీవెన్స్ నిర్వహించనున్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు అర్జీదారుల సమస్యలు తెలుసుకోనున్నారు. ఈ మేరకు సమస్యలను అర్జీరూపంలో అందజేయాలని కలెక్టర్ సూచించారు.

ఎస్వీయూ అధికారుల అత్యుత్సాహం

- కూటమి నేతల సిఫార్సుతో ఐదుగురికి ఉద్యోగాలు

తిరుపతి సిటీ : ఎస్వీయూలో అధికారుల అత్యుత్సాహం మితిమీరుతోంది. నిబంధలకు విరుద్ధంగా నోటిఫికేషన్ సైతం విడుదల చేయకుండా ఇష్టానుసారంగా నియామకాలు చేపడుతున్నారు. అందులో భాగంగా వర్సిటీలోని గ్రంథాలయం, ఎస్వీ క్యాంపస్ స్కూల్, ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగంలో కాంట్రాక్ట్ బేసిస్ అంటూ నియామకాలు చేపట్టారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం కాంట్రాక్ట్ ఉద్యోగులకు నెలకు రూ. 22వేలు మాత్రమే చెల్లించాల్సి ఉండగా, నూతనంగా నియమించిన వారికి రూ. 25వేల వేతనం ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిసింది. అలాగే పలు విభాగాలల్లో నాన్ టీచింగ్ నియామకాలపై దృష్టి సారించి ఒక్కో పోస్టుకు రూ.లక్షలు దండుకుంటున్నట్లు సమాచారం. ఈ మేరకు కూటమి నేతల సిఫార్సులను పరిగణనలోకి తీసుకుని నియామకాలు చేపట్టినట్లు తెలుస్తోంది.


ఇద్దరు అధ్యాపకులపై వేటు

వర్సిటీలోని ఎంబీఏ, ఎంసీఏ విభాగాలలో పనిచేస్తున్న ఇద్దరు అధ్యాపకులను విధుల నుంచి తప్పించారు. సక్రమంగా పనిచేయకపోవడం, విధులకు రెగ్యులర్‌గా హాజరుకాకపోవడంతో వేటు వేసినట్లు తెలిసింది.

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు నిండిపోవడంతో భక్తులు గోగర్భం డ్యామ్ వరకు బారులు తీరారు. శనివారం అర్ధరాత్రి వరకు 83,380 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 32,275 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ.3.71 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని వారికి 24 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు ఉంటే 3 గంటల్లోనే దర్శనమవుతోంది. ఈ క్రమంలోనే సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికే క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. కేటాయించిన సమయం కంటే ముందు వెళితే క్యూలోకి అనుమతించమని స్పష్టం చేసింది.

సూర్యభగవానుడికి ప్రత్యేక పూజలు


పూజాసామగ్రి తీసుకెళుతున్న ఉభయకర్తలు

ఏర్పేడు : మండలంలోని గుడిమల్లంలో వెలసిన ఆనందవల్లీ సమేత పరశురామేశ్వరాలయంలో ఆదివారం సూర్యభగవానుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తిరుపతి భారతీయ మజ్దూర్ సంఘ్ అధ్యక్షుడు ఆకుల సతీష్, గౌతమి, తీర్థప్రసాద్ ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఈఓ రామచంద్రారెడ్డి, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ గిరినాయుడు, అర్చకులు వంశీకృష్ణ, పవన్‌కుమార్ శర్మ పాల్గొన్నారు.

ప్రాణాపాయంలో పాళెంపాడు


పాళెంపాడు గ్రామం

దొరవారిసత్రం మండలం పాళెంపాడు వాసులు ప్రాణాపాయంలో ఉన్నారు. కిడ్నీ సంబంధిత వ్యాధులతో తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. ప్రస్తుతం 25 మంది రోగులు చికిత్స పొందుతున్నారు. గత రెండేళ్లలో ఆరుగురు మృత్యువాత పడ్డారు. వయసుతో నిమిత్తం లేకుండా రోగుల సంఖ్య పెరుగుతుండడంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. మహమ్మారి వ్యాప్తికి కారణం కనిపెట్టేందుకు అధికారులు ఇంటింటికీ వెళ్లి బ్లడ్ టెస్టులు చేయించారు. గ్రామంలో రక్షిత పథకం.. చేతి బోర్లలో నీటిని పరీక్షించారు. అయినప్పటికీ అసలు సమస్యను గుర్తించలేకపోయారు. భూగర్భ జలాలు కలుషితం కావడం వల్లే పలువురు కిడ్నీ వ్యాధి బారిన పడుతున్నారని వైద్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. సురక్షిత తాగునీటిని అందిస్తే ఇబ్బందులను అధిగమించే అవకాశముంటుందని సూచిస్తున్నారు.

కిడ్నీ వ్యాధితో విలవిల్లాడుతున్న 25 మంది బాధితులు

- రెండేళ్లలోనే ఆరుగురి మృత్యువాత
- విషమ పరిస్థితుల్లో మరో ఇద్దరు
- ఇప్పటికీ సమస్యకు కారణం గుర్తించలేని అధికారులు
- దిక్కుతోచక కొట్టుమిట్టాడుతున్న గ్రామస్తులు

దొరవారిసత్రం : మండలంలోని ఏకొల్లు పంచాయతీ పాళెంపాడుకు కిడ్నీ వ్యాధి శాపంగా మారింది. గ్రామంలోని ప్రజలు పిట్టలా రాలిపోతున్నారు. ఈ వ్యాధి బారిన ఎలా పడుతున్నారనే విషయం అధికారులకు అంతుపట్టడంలేదు. గడిచిన రెండేళ్లలో కిడ్నీ వ్యాధితో బాధపడుతూ ఐదుగురు మృతి చెందగా, ఇరవై రోజుల కింట సగిలాల వెంకటేష్ (35) అనే యువకుడు రెండు కిడ్నీలు ఫెయిల్యూర్ కావడంతో మృత్యువాత పడ్డాడు. దీంతో కిడ్నీ వ్యాధి మృతుల సంఖ్య ఆరుకు చేరింది. కిడ్నీ వ్యాధి గ్రస్తులు పెరగడంతో ప్రజలు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. గ్రామంలో సుమారు 15 రోజులుగా వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నారు. ఇంటింటికీ వెళ్లి రక్త పరీక్షలు చేస్తున్నారు. మరో వైపు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు క్షేత్రస్థాయిలో రక్షిత పథకం నీటితోపాటు, చేతి బోర్లలోనే జలాలను పరీక్షలు చేయించారు. అయితే ఇప్పటికీ కిడ్నీ వ్యాధి విజృంభణకు కారణాలను కనిపెట్టలేకపోతున్నారు.

అంతుబట్టని కారణాలు

పాళెంపాడులో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారుల నుంచి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల వరకు పర్యటించారు. వైద్యశిబిరం ఏర్పాటు చేసి వివిధ పరీక్షలు చేయిస్తూనే ఉన్నారు. అయితే ఇప్పటికీ అసలు కారణాలు అంతుపట్టడం లేదని చెబుతున్నారు.

అంతటా ఆందోళన

గ్రామంలో సుమారు 170 కుటుంబాలున్నాయి. 750 నివసిస్తున్నారు. వైద్యాధికారులు లెక్కల ప్రకారం ఇప్పటి వరకు కిడ్నీ రోగులు 25 మంది ఉన్నట్లు గుర్తించారు. అందులో ప్రస్తుతం ఇద్దరు డయాలసిస్ చేయించుకుంటున్నారు. వీరి పరిస్థితి కూడా ఆందోళనకరంగా ఉన్నట్లు గ్రామస్తులు తెలిపారు. పాళెంపాడులో గత కొన్నేళ్లుగా కిడ్నీ వ్యాధి వ్యాప్తి చెందుతున్నప్పటికీ ఎవరూ పట్టించుకోలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంతో పలుమార్లు జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి సమస్యను తీసుకువచ్చినా స్పందించలేదని ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలో గ్రామస్తులు ఎవరి తోచిన కారణాలను వారు వెల్లడిస్తున్నారు. చేతి బోర్లతో నీరు తాగి కిడ్నీలు దెబ్బతిన్నాయని కొందరు, స్థానికంగా వైద్యం అందించే ఆర్ఎంపీల మందుల వాడడం వల్లే ఈ దుస్థితి దాపురించిందని మరికొందరు చెబుతున్నారు. ఆర్ఎంపీలు రాసిన పెయిన్ కిల్లర్ మందులను ఇబ్బడి ముబ్బడిగా వాడడంతో కిడ్నీ సమస్యలు తలెత్తినట్లు పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల మృతి చెందిన వెంకటేష్ కూడా ఆర్ఎంపీ వైద్యుడు ఇచ్చిన మందులు వేసుకోవడంతో కిడ్నీలు దెబ్బతిన్నట్లు బాధిత కుటుంబీకులు వివరిస్తున్నారు. ఏది ఏమైనా ఒకే గ్రామంలో ఇంతమంది కిడ్నీ వ్యాధిగ్రస్తులు ఉండడమంటే చిన్న విషయం కాదని వైద్యులు స్పష్టం చేస్తున్నారు. అసలు కారణం తెలుసుకుంటేనే సమస్యను పరిష్కరించవచ్చని వెల్లడిస్తున్నారు.


పాళెంపాడు వాసులతో మాట్లాడుతున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ ఎస్ఎండీ సత్తార్ (ఫైల్)

ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ ఎస్‌డీఎం సత్తార్ 12 రోజుల కిందట గ్రామంలో పర్యటించి నాలుగు చేతి బోర్లను రీఫుల్లింగ్ చేయించారు. రక్షిత నీటి పథకం ఓవర్ హెడ్ ట్యాంకును పూర్తిస్థాయిలో క్లోరినేషన్ చేయించారు. మళ్లీ గ్రామంలో నీటిని పరీక్షలకు పంపించి, నివేదికలు వచ్చిన తర్వాతే గ్రామస్తులు వాడుకునేలా చర్యలు చేపట్టాలని స్థానిక అధికారులను ఆదేశించారు. అప్పటి వరకు ట్యాంకర్ల ద్వారా గ్రామానికి తాగునీరు సరఫరా చేయాలని సూచించారు.

పారిశుద్ధ్యలోపమూ ఓ కారణమే..

పాళెంపాడులో కిడ్నీ వ్యాధిగ్రస్తులు పెరిగేందుకు గ్రామంలోని పారిశుద్ధ్యలోపమూ ఓ కారణమని స్థానిక వైద్యాధికారులు అభిప్రాయపడుతున్నారు. తిరుపతి, విశాఖపట్నంలోని ల్యాబ్‌లలో ఇటీవల పాళెంపాడు గ్రామంలోని నీటి శ్యాంపిళ్లను పరీక్షించారు. ఈ సందర్భంగా భూగర్భ జలాలు కలుషితమైనట్లు తెలిసిందని అధికారులు వెల్లడిస్తున్నారు. చేతిబోర్లలో సైతం బ్యాక్టీరియా ఉందని తెలియజేస్తున్నారు.


ఇళ్ల మధ్యలో పేడ దిబ్బ


గ్రామంలోని వీధి కొళాయి దుస్థితి

ఆందోళనగా ఉంది



రెండు కిడ్నీలు దెబ్బతిన్నట్లు మూడేళ్ల క్రితం తెలిసింది. ఇక అప్పటి నుంచి చికిత్సపొందుతున్నా. అయినప్పటికీ అనారోగ్యంతో ఏ పనీ చేసుకోలేని స్థితిలో ఉన్నా. ఎప్పుడు ఏం జరుగుతుందో ఆందోళనగా ఉంది. గతంలో చేతి బోరులోని నీటినే తాగేవాడిని. ఆ నీటి కారణంగానే కిడ్నీ వ్యాధి వచ్చిందని ఇప్పుడు కొందరు చెబుతున్నారు. నాలాంటి పరిస్థితి ఎవరికీ రాకూడదు. సమస్యలను కనిపెట్టి పరిష్కరిస్తే గ్రామానికి మంచి జరుగుతుంది. – దేవళ్ల పెద్ద చెంగయ్య(65), కిడ్నీ వ్యాధిగ్రస్తుడు, పాళెంపాడు

చెడు అలవాట్లు లేవు



నాకు ఎలాంటి చెడు అలవాట్లు లేవు. అయినప్పటికీ రెండేళ్ల క్రిందట రెండు కిడ్నీలు దెబ్బతిన్నాయి. ఎన్ని మందులు వాడినా ప్రయోజనం లేకుండా పోతోంది. ఇప్పుడు ఏం తినాలన్నా.. కనీసం నీరు తాగాలన్నా భయమేస్తోంది. ఏ పని చేయలేక, ఇంటి వద్దనే ఉంటున్నా. గ్రామంలో తలెత్తిన సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం చొరవ తీసుకోవాలి. – దేవళ్ల చిన్నచెంగయ్య(62), కిడ్నీ వ్యాధిగ్రస్తుడు, పాళెపాడు

నీటి కారణంగానే..



గ్రామంలో చేతి బోరులో నీరు తాగడం వల్లే కిడ్నీలు పాడయ్యాయయి. ఇందులో నాకు ఎలాంటి అనుమానం లేదు. అయితే కొందరు బయటి ప్రాంతాల నుంచి క్యాన్ వాటర్ తెచ్చుకుని వాడుకుంటున్నప్పటికీ కిడ్నీ సమస్యలు తలెత్తాయి. నేను రెండేళ్ల నుంచి కిడ్నీ వ్యాధికి చికిత్స పొందుతున్నా. నరకం అనుభవిస్తున్నా. – సమ్మన పరదేశయ్య(60) కిడ్నీ వ్యాధిగ్రస్తుడు, పాళెంపాడు

కలుషిత నీటితోనే..



పాళెంపాడులో కలుషిత నీటిని తాగడం వల్లే పలువురు కిడ్నీ వ్యాధి బారిన పడ్డారు. అక్కడి చేతిబోర్లలోని నీటిని తిరుపతిలోని మైక్రోబయాలజీ ల్యాబ్‌కు పంపాం. ఆ నీటిలో బ్యాక్టీరియా ఉన్నట్లు గుర్తించారు. అలాగే బోరు నీటిలో ఖనిజ లవణాలు పెరగడం వల్ల కూడా కిడ్నీలు దెబ్బతిని ఉండవచ్చు. ఊరిలోని పేడ దిబ్బల కారణంగా కూడా నీరు కలుషితమవుతోంది. – వి.చైతన్య, వైద్యాధికారి, డీవీ సత్రం పీహెచ్‌సీ

దర్జాగా దోషులు.. నిర్దోషులకు వేధింపులు


మాట్లాడుతున్న మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి

కార్వేటినగరం : అంబేడ్కర్ విగ్రహానికి నిప్పు పెట్టిన ఘటనలో దోషులను దర్జాగా వదిలేసి, నిర్దోషులను వేధిస్తున్నారని మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి మండిపడ్డారు. ఆదివారం పుత్తూరులోని తన నివాసంతో మీడియాతో మాట్లాడారు. దళితులపై కక్షగట్టి అంబేడ్కర్ విగ్రహానికి నిప్పు పెట్టిన నిందితుడిని ప్రభుత్వం వదిలేసిందని ఆరోపించారు. దేవళంపేటలో రాజ్యాంగ నిర్మాత విగ్రహం నెలకొల్పిన సర్పంచ్ గోవిందయ్యను మాత్రం అరెస్ట్ చేయించిందని విమర్శించారు. ఎలాంటి విచారణ చేయకుండానే ఎలా కస్టడీలోకి తీసుకుంటారని ప్రశ్నించారు. గ్రామంలో అంబేడ్కర్ విగ్రహం పెట్టినప్పటి నుంచి గొడవ చేస్తున్న టీడీపీ నేత సతీష్‌నాయుడుని వదిలిపెట్టడం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు. సతీష్‌నాయుడు పలుమార్లు విగ్రహం తొలగించేందుకు యత్నించాడని ఆరోపించారు. అయినప్పటికీ పోలీసులు పట్టించుకోకపోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. వాస్తవాలను వెలికితీయాల్సిన పోలీసులు సైతం కూటమి ఎమ్మెల్యేతో కలిసి మాట్లాడడం సమంజసం కాదని స్పష్టం చేశారు. ఈ విషయంలో అధికారులను సైతం దోషులుగా నిలబెట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. విగ్రహానికి నిప్పు పెట్టిన దృశ్యాలు సీసీ కెమెరాల్లో ఉన్నాయని, అయితే పోలీసులు అలాంటివి లేవని చెప్పడం దుర్మార్గమని మండిపడ్డారు. ఈక్రమంలోనే తప్పు చేసిన వారిని కఠినంగా శిక్షించాలని, నిర్దోషికి శిక్ష పడకూడదని స్పష్టం చేశారు. అంబేడ్కర్ విగ్రహానికి తానే నిప్పు పెట్టానని ఒప్పుకోవాలని ఓ మహిళను బలవంతం చేస్తున్నట్లు సమాచారం ఉందని ఆరోపించారు. అభం శుభం తెలియని అమాయకులపై కేసులు పెట్టడం సరికాదని, నిజమైన దోషిని గుర్తించి రాజకీయాలకు అతీతంగా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్‌సీపీ జీడీ నెల్లూరు నియోజకవర్గ సమన్వయకర్త కృపాలక్ష్మి, పార్టీ లీగల్‌సెల్ జిల్లా అధ్యక్షుడు సూర్యప్రతాప్, ఉపాధ్యక్షుడు గోవర్దన్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు సుకుమార్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంతోనే బలోపేతం


సమావేశంలో యూనియన్ నేతలు

తిరుపతి రూరల్ : ఉద్యోగుల సమస్యల పరిష్కారంతోనే యూనియన్ బలోపేతమవుతుందని జనశక్తి విద్యుత్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు తోకల అశోక్‌కుమార్ తెలిపారు. ఆదివారం తిరుపతిలోని ఎస్‌జీఎస్ కళాశాల వద్ద ఏపీఎస్ఈబీ ఇంజినీర్స్ అతిథిగృహంలో యూనియర్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. అశోక్‌కుమార్ మాట్లాడుతూ కాంట్రాక్టు, రెగ్యులర్ కార్మికుల సమస్యల పరిష్కారానికి జనశక్తి విద్యుత్ ఎంప్లాయీస్ యూనియన్ అండగా నిలబడుతుందన్నారు. సంఘం గౌరవ అధ్యక్షుడు ఆశహరి సుధాకర్ మాట్లాడుతూ విద్యుత్ కార్మికుల సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకెళతామని వెల్లడించారు. ముఖ్య సలహాదారు టి.సాయి సుధాకర్ మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం రాజీలేని పోరాటం చేస్తామన్నారు. సమావేశంలో నేతలు ఎస్.పవన్ కుమార్, ఇరివిశెట్టి వెంకటాద్రి, శ్రీరామ్ మల్లికార్జున, పి.సోమశేఖర్, కేవీ ప్రసాద్, వి.మునిరామకృష్ణ, జి.రమేష్ బాబు, బంగారు వెంకటేష్, రామానాయుడు, ధర్మేంద్ర, పీజీ రాజు, బి.కిరణ్, ఎం.భానుచంద్ర పాల్గొన్నారు.

క్లుప్తంగా

4 టన్నుల రేషన్ బియ్యం పట్టివేత


పోలీస్ స్టేషన్ వద్ద రేషన్ బియ్యం

కేవీబీపురం : మండలంలోని సూరమాల వద్ద మామిడితోటలో అక్రమంగా నిల్వ చేసిన 4.4 టన్నుల రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు శనివారం రాత్రి సీజ్ చేశారు. ఎస్ఐ నరేష్ కథనం మేరకు.. రేషన్ దందాపై పక్కా సమాచారం అందడంతో విజిలెన్స్ అధికారులు దాడి చేసి రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. పట్టుబడిన బియ్యం విలువ సుమారు రూ.50వేల వరకు ఉండవచ్చని తెలిపారు. తహసీల్దార్ ఆధ్వర్యంలో బియ్యం బస్తాను గోడౌన్‌కు తరలించినట్లు వివరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

చోరీ కేసులో నిందితుడికి రిమాండ్


నిందితుడు జయచంద్రారెడ్డి

రేణిగుంట : మండలంలోని కొత్తపాళెంలో ఇత్తడి బిందెలను చోరీ చేసిన కేసులో నిందితుడు జయచంద్రారెడ్డి(30)కి కోర్టు రిమాండ్ విధించింది. బాధితుల ఫిర్యాదు మేరకు విచారించి నిందితుడిని అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్ఐ సుధాకర్ తెలిపారు. జయచంద్రారెడ్డిపై గతంలో ఎర్రచందనం స్మగ్లింగ్ కేసులు రెండు ఉన్నట్లు వెల్లడించారు.

యువకుడిపై పోక్సో కేసు

చంద్రగిరి : బాలికపై లైంగికదాడికి యత్నించిన యువకుడిపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. వివరాలు.. చంద్రగిరి బీడీ కాలనీకు చెందిన బాలిక(14) శనివారం ఇంటి వద్ద పాత్రలు కడుగుతుండగా, పాకాల అలీ అనే యువకుడు మాయమాటలు చెప్పి ఇంట్లోకి తీసుకెళ్లి లైంగికదాడికి యత్నించాడు. బాలిక కేకలు వేయడంతో స్థానికులు వచ్చారు. వెంటనే అలీ అక్కడ నుంచి పరారయ్యాడు. బాలిక కుటుంబీకుల ఫిర్యాదు మేరకు నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. అలీ కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు.

విద్యుదాఘాతంతో లైన్‌మన్ మృతి


సుబ్రమణ్యం (ఫైల్)

సత్యవేడు: మండలంలోని బాలకృష్ణాపురం పంచాయతీలో ఏ.సుబ్రమణ్యం (49) అనే లైన్‌మన్ విద్యుదాఘాతంతో శనివారం సాయంత్రం మృతి చెందాడు. వివరాలు.. ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతు చేస్తుండగా సుబ్రమణ్యానికి కరెంట్ షాక్ తగలడంతో అక్కడికక్కడే మరణించాడు. మృతుడి భార్య రేవతి ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్ ఫిర్యాదు చేసింది. భర్త మృతిపై అనుమానం ఉందని పేర్కొంది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామస్వామి తెలిపారు.

తిరువణ్ణామలైకి ప్రత్యేక బస్సులు

తిరుపతి అర్బన్: తమిళనాడులోని తిరువణ్ణామలైకి పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేస్తున్నట్లు తిరుపతి ఆర్టీసీ అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ భాస్కర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 4 నుంచి మంగళవారం ఉదయం 9 గంటల వరకు ప్రతి 30 నిమిషాలకు ఓ బస్సును ఏర్పాటు చేస్తున్నట్టు వెల్లడించారు. అలాగే తిరిగి రావడానికి అవసరమైన బస్సులను సమకూర్చినట్లు ఆయన పేర్కొన్నారు.

నేత కార్మికులకు ఉచిత విద్యుత్ జీఓ ఇచ్చి ఆరు నెలలు గడిచింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే పవర్‌లూమ్స్‌కు మంచి రోజులు వస్తాయని నేతన్నలు ఆశించారు. సర్కారు కొలువు దీరి ఏడాదిన్నర కావస్తున్నా విద్యుత్ బాదుడు కొనసాగుతూనే ఉంది. కంటి తుడుపుగా జీఓ ఇచ్చి చేతులు దులుపుకోవడంతో నేత కార్మికులు మండిపడుతున్నారు. హామీ అమలు చేయాలంటూ ఆందోళనబాట పడుతున్నారు.



నేతన్నకు ఉత్తుత్తి విద్యుత్

- నేత కార్మికులకు అందని ఉచిత విద్యుత్
- 93 వేల చేనేత కుటుంబాలకు 200 యూనిట్లు
- 10,534 పవర్‌లూమ్ యూనిట్లకు 500 యూనిట్లు
- కేవలం ప్రకటనలకే పరిమితమైన హామీ
- అమలుకు మీనమేషాలు లెక్కిస్తున్న కూటమి ప్రభుత్వం

పుత్తూరు : ఉచిత విద్యుత్ జీఓతో తమ కుటుంబాలకు కొంతైనా ఆర్థిక భారం తగ్గుతుందనుకున్న నేతన్న జీవితాల్లో నిరాశే మిగిలింది. వ్యవసాయం తర్వాత చేనేత రంగం అతిపెద్ద ఉపాధి రంగం. ఇంతటి ప్రాముఖ్యం కలిగిన ఈ రంగం ప్రస్తుతం దయనీయ పరిస్థితిని ఎదుర్కొంటోంది. లయబద్ధంగా వినబడే పవర్‌లూమ్స్ ధ్వని వినిపించడం తగ్గిపోతోంది. ఇందుకు వివిధ సుంకాల పేరిట పెరిగిన విద్యుత్ చార్జీలే ప్రధాన కారణం. చాలీ చాలని కూలీలతో జీవితాలు అప్పుల పాలవుతున్నాయని నేత కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫలితంగా దాదాపు అన్ని పవర్‌లూమ్ కేంద్రాలు మూతపడే పరిస్థితిలోకి వెళ్తున్నాయి. గత మార్చి 26వ తేదీన ప్రభుత్వం విడుదల చేసిన ఉచిత విద్యుత్ జీవో నంబర్ 44 ఆరు నెలలు పూర్తయినా అమలు కాకపోవడంతో నేతన్నలు ఆందోళనకు సిద్ధమవుతున్నారు.

నేతన్నల డిమాండ్లు

- జీవో నంబర్ 44ను వెంటనే అమలు చేయాలి
- మొత్తం రాష్ట్ర బడ్జెట్ నుంచి 10 శాతం 3,000 కోట్లు కేటాయించాలి
- నేతన్న నేస్తం పథకాన్ని అమలు చేయాలి
- చేనేత వస్త్ర ఉత్పత్తులకు జీరో జీఎస్టీని వర్తింప చేయాలి
- నూలు, సిల్క్‌లకు 50 శాతం రాయితీ ఇవ్వాలి
- చేనేత కుటుంబాలకు రూ.5 లక్షల వరకు వడ్డీ లేని రుణాలు ఇవ్వాలి
- గృహం, వర్క్ షెడ్ పథకాన్ని అమలు చేయాలి
- జీవిత బీమా సంస్థ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమలు చేసిన బీమా పథకాన్ని కొనసాగించాలి
- సహకార సంఘాలను బలోపేతం చేయాలి


విద్యుత్ ఈఈకి వినతిపత్రం అందిస్తున్న మరమగ్గం కార్మికులు (ఫైల్)

నేతన్న నేస్తంతో ఆదుకున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నేతన్న నేస్తం పథకం ద్వారా మగ్గం కలిగిన ప్రతి నేతన్నకు ఏడాదికి రూ.24 వేల ఆర్థిక సాయం అందించింది. అంతే కాకుండా విద్యుత్ చార్జీల నుంచి 96 పైసల యూజర్స్ చార్జీలను తగ్గించి వెసులుబాటు కల్పించింది. ఈ నేపథ్యంలో గత ఏడాది జరిగిన రాష్ట్ర సార్వత్రిక ఎన్నికల సమయంలో ప్రతిపక్ష నాయకుడి హోదాలో నారా చంద్రబాబు నాయుడు పుత్తూరులో పర్యటించారు. ఆ సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో చంద్రబాబు మాట్లాడుతూ.. చేనేత, పవర్‌లూమ్స్ కార్మికులకు 500 యూనిట్ల కరెంట్ ఉచితంగా ఇస్తానంటూ హామీ ఇచ్చారు. గుడ్డిగా నమ్మిన రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న నేత కార్మికులు కూటమి అభ్యర్థులకు ఓట్లు వేసి గెలిపించారు. అయితే అధికారంలోకి వచ్చిన బాబు మాత్రం నాటి ఎన్నికల హామీకి ఎగనామం పెట్టడంతో పాటు వివిధ సుంకాల పేరిట విద్యుత్ చార్జీలను పెంచి నేత కార్మికుల నడ్డి విరిచారు.

జీవో అమలులో నిర్లక్ష్యం

అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వంపై ఉచిత విద్యుత్ హామీని నెరవేర్చాలంటూ వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఒత్తిడి తీసుకొచ్చారు. దీంతో దిగివచ్చిన బాబు ప్రభుత్వం ఈ ఏడాది మార్చి 26వ తేదీన జీవో 44ను విడుదల చేసింది. ఇందులోనూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కార్మికుల వాస్తవ సంఖ్య, పవర్‌లూమ్ యూనిట్ల సంఖ్యను గణనీయంగా తగ్గించి చూపిస్తూ జీవో విడుదల చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా నూలు, పట్టు చేనేత కుటుంబాలు 2,79,000 వేల మంది ఉండగా కేవలం 93 వేల మందిగా చూపించారు. అలాగే మరమగ్గాలు 81 వేలు ఉండగా కేవలం 10,534 ఉన్నట్టుగా చూపించారు. ఈ లెక్కల ప్రకారం చేనేత కుటుంబాలకు నెలకు 200 యూనిట్లు, పవర్‌లూమ్ యూనిట్లకు నెలకు 500 యూనిట్ల ఉచిత విద్యుత్ అందించనున్నట్లు జీవోలో స్పష్టం చేశారు. ఇందుకు ఏడాదికి సుమారు రూ.125 కోట్ల ఆర్థిక భారం పడనున్నదని పేర్కొన్నారు. జీవో అమలుకు డిస్కమ్ సంస్థలు ఇంధన శాఖకు తగిన బడ్జెట్ మంజూరు చేయాలని ప్రతిపాదించారు. అయితే జీవో విడుదలై 6 నెలలు కావస్తున్నా బడ్జెట్ విడుదల కాకపోవడంతో నేటికీ జీవో అమలుకు నోచుకోలేదు.

సిబ్బందిని అడ్డుకొని..


విద్యుత్ రీడింగ్ బాయ్‌ని అడ్డుకున్న కార్మికులు (ఫైల్)

ప్రతినెలా యథావిధిగా పెరిగిన విద్యుత్ చార్జీల బిల్లులను అందుకొంటున్న నేతన్నలు తలలు పట్టుకొంటున్నారు. గత సెప్టెంబర్ నెలలో విద్యుత్ ఈఈకి జీఓ అమలు చేయాలని వినతిపత్రం సమర్పించారు. ఈనెలలో విద్యుత్ రీడింగ్ తీయడానికి వచ్చిన విద్యుత్ సిబ్బందిని కార్మికులు అడ్డుకొని వెనక్కు పంపారు. ఈ నేపథ్యంలో జీవో అమలుకు వైఎస్సార్‌సీపీ సారథ్యంలో ఆందోళనలకు నేతన్నలు సిద్ధమవుతున్నారు.

జీవో ఇచ్చారు.. మరిచిపోయారు...



ఉచిత విద్యుత్ పేరిట జీఓ ఇచ్చి అమలు చేయక పోవడం దారుణం. పెరిగిన విద్యుత్ చార్జీలు చెల్లించలేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాం. పక్క రాష్ట్రం తమిళనాడులో 15 ఏళ్లుగా ఉచిత విద్యుత్ అమలు చేస్తు న్నారు. మార్చి నెలలో జీఓ ఇచ్చి, ఆగస్టులో అమలు చేస్తామని చెప్పి అక్టోబర్ వచ్చినా బిల్లులు చేతికిస్తున్నారు. మా పరిస్థితి అర్థం చేసుకొని ఉచిత విద్యుత్ జీఓను వెంటనే అమలు చేయాలి.

– చిన్నప్ప, శీలకారువీధి, పుత్తూరు

ప్రత్యక్ష పోరాటానికి సిద్ధం



ఉచిత విద్యుత్‌పై మార్చిలో జీఓ విడుదల చేసినా ఆగస్టు నుంచి అమలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అయితే అక్టోబర్ వచ్చినా విద్యుత్ బిల్లులు యథావిధిగా ఇస్తున్నారు. దీనిపై ఇప్పటికే రాష్ట్రంలో పలుచోట్ల అధికారులకు వినతిపత్రాలు సమర్పించాం. అయినా ఫలితం శూన్యం. దీంతో విధిలేక అన్ని కార్మిక సంఘాలు, వివిధ రాజకీయ పార్టీలతో కలిసి ప్రత్యక్ష పోరాటానికి నేత కార్మికులు సిద్ధమవుతున్నాం. కార్మికులు రోడ్డెక్కక ముందే ప్రభుత్వం స్పందించి ఇచ్చిన జీఓను అమలు చేయాలని కోరుతున్నాం.

– ఆకుల వాసు, అధ్యక్షుడు, రాష్ట్ర చేనేత కార్మికుల యూనియన్, తిరుపతి

వీసీ..పేచీ!

ఉన్నత విద్య నిర్వీర్యం

- గాడితప్పిన వర్సిటీల పాలన
- వీసీల నియామకాల్లో తీవ్ర జాప్యం
- విద్యార్థుల భవితవ్యం.. అగమ్యగోచరం



తిరుపతి సిటీ: కూటమి ప్రభుత్వం విద్యారంగాన్ని భ్రష్టుపట్టిస్తోంది. అవగాహన లేకనో.. విద్యారంగాన్ని ప్రైవేటు పరం చేయాలనే కుట్రతోనో వర్సిటీలపై దృష్టి సారించకుండా నిర్లక్ష్యం చేస్తోంది. తిరుపతి, చిత్తూరు జిల్లాల్లోని వర్సిటీలకు పూర్తి స్థాయి వీసీల నియామకాలను చేపట్టకుండా శోద్యం చూస్తోంది. వర్సిటీలలో పాలన స్తంభించి పోతోంది. నియామకాలు, బదిలీల విషయంలో తాత్కాలిక వీసీలు తమ అనుచరులకు పెద్దపీట వేశారు. అధికార పార్టీకి చెందిన నాయకుల ఒత్తిడితో వర్సిటీలను నడిపిస్తూ అరాచకాలకు పాల్పడుతున్నారు. దీంతో వర్సిటీల భవితవ్యం ఆగమ్య గోచరంగా మారింది.

చేతులెత్తేసిన కూటమి

జిల్లాలోని ఎస్వీయూనివర్సిటీ, ద్రావిడ వర్సిటీ, ఎస్వీ వెటర్నరీ వర్సిటీలకు సంబంధించి వీసీల నియామకంలో కూటమి ప్రభుత్వం చేస్తున్న హడావుడి ఇంతా అంతా కాదు. గత ప్రభుత్వంలో నియమితులైన వీసీలను బలవంతంగా ఒత్తిడి తెచ్చి రాజీనామలను చేయించారు. ఆ తర్వాత మంత్రి లోకేష్ ఇప్పటి వరకు జిల్లాలోని పలు వర్సిటీలకు వీసీలను నియమించలేకపోయారు.

నిగ్గుతేల్చని వైనం

జిల్లాలోని ఎస్వీయూ, ద్రావిడ వర్సిటీలకు వీసీల నియామకాలకు సంబంధించి మంత్రి లోకేష్ ఇప్పటికే సుమారు మూడు సార్లు సెర్చ్ కమిటీలను నియమించి విఫలమయ్యారు. గత 20 నెలల నుంచి జిల్లాలోని పలు వర్సిటీలకు ఇన్‌చార్జిలను నియమించి కాలయాపన చేస్తూ వస్తున్నారు. ఇందులో ప్రధానంగా జనసేన, టీడీపీకి చెందిన సామాజిక వర్గాల అధ్యాపకులు పెద్ద ఎత్తున ఆయా పార్టీల అధినేతలో మంత్రి లోకేష్‌కు ఒత్తిడి తేవడంతో సెర్చ్ కమిటీలు సైతం చేతులెత్తేశాయి. ఇప్పటికీ మూడు సార్లు జిల్లాలోని యూనివర్సిటీలకు వీసీలను నియమించేందుకు ఏర్పాటు చేసిన కమిటీలు తమ వల్ల కాదంటూ చేతులెత్తేశాయి. దీంతో ఇప్పటి వరకు ఆ దిశగా మంత్రితో పాటు ఉన్నత విద్యామండలి అధికారులు అడుగులు వేయాలంటే భయపడుతున్నారు.

మొగ్గు చూపని ఎన్ఐటీ, ఐఐటీ నిపుణులు

జిల్లాలోని ఎస్వీయూ, వెటర్నరీ, ద్రావిడ వర్సిటీలకు సంబంధించి వీసీ నియామకాలను సంబంధించి కూటమి ప్రభుత్వం ఎన్ఐటీ, ఐఐటీ అధికారులను నియమించాలని ప్రయత్నం చేసింది. ఇప్పటికే రాష్ట్రంలోని పలు వర్సిటీలకు ఆ దిశగా నియామకాలు చేపట్టింది. కానీ ఆ యూనివర్సిటీలలో నియమితులైన ఐఐటీ, ఎన్ఐటీ నిపుణులకు వర్సిటీలపై పూర్తి స్థాయి అవగాహన లేకపోవడంతో తమను ఆ విధుల నుంచి తప్పించాలని వారు విద్యాశాఖా మంత్రిని, ఉన్నత విద్యామండలికి విన్నవించారు. దీంతో ఎస్వీయూ వంటి ప్రతిష్ఠాత్మకవర్సిటీలకు వీసీ నియామకం విషయంలో ఎటూ తేల్చుకోలేని స్థితిలో కాలక్షేపం చేస్తోంది.

ఎస్వీయూలో పరిస్థితి దారుణం

ఎస్వీయూలో పాలన పూర్తిగా స్తంభించిపోయింది. పూర్తి స్థాయి వీసీని నియమించకపోవడంతో పాటు ప్రస్తుత ఇన్‌చార్జి వీసీకి రిజిస్ట్రార్‌కు పలు విషయాలలో విభేదాలు నెలకొనడంతో పాలన గాడితప్పింది. పాలన పూర్తిగా ఉన్నత విద్యామండలి చేతులోకి వెళ్లింది. ప్రతి చిన్న విషయానికి ఉన్నత విద్యామండలి జోక్యం చేసుకుంటోంది. 2025 పీజీ సెట్ అడ్మిషన్ల విషయంలో కనీసం ఇప్పటి వరకు అన్ని విభాగాలలో 30శాతం అడ్మిషన్లు కాకపోవడం ఆలోచించాల్సి విషయం.

పాలన స్తంభించింది



ఎస్వీయూ వంటి వర్సిటీలకు పూర్తి స్థాయి వీసీలను నియమించలేక కూటమి ప్రభుత్వం చేతులెత్తేసింది. వర్సిటీల్లో పాలన పూర్తిగా స్తంభించింది. వర్సిటీ అభివృద్ధిపై ఇన్‌చార్జ్ వీసీలకు పూర్తి స్థాయి అధికారం లేకపోవడంతో తూతూమంత్రంగా పాలన సాగిస్తున్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం వర్సిటీలపై దృష్టి సారించాలి. –అశోక్ కుమార్, ఎస్ఎఫ్ఐ యూనివర్సిటీల కో–ఆర్డినేటర్, తిరుపతి

నిర్వీర్యం చేసే ప్రయత్నమే



కూటమి ప్రభుత్వం విద్యావ్యవస్థను నిర్వీర్యం చేస్తోంది. ఇంటర్, డిగ్రీ, పీజీ అడ్మిషన్లు కనీసం 30శాతం సైతం ప్రభుత్వ సంస్థలలో ప్రవేశాలు కావడం లేదు. దీనికి తోడు వర్సిటీలలో పాలన పూర్తిగా స్తంభించింది. ఇప్పటి వరకు ఎస్వీయూకు పూర్తి స్థాయి అధికారులు లేరు. ఇన్‌చార్జి పాలనతో కాలయాపన చేస్తున్నారు. ప్రైవేటు వ్యక్తులకు వర్సిటీలను అప్పజెప్పే ప్రయత్నం చేస్తే ఊరుకోం. –బండి చలపతి, ఏఐఎస్ఎఫ్, రాష్ట్ర సహాయ కార్యదర్శి, తిరుపతి

దాడి చేసి దోపిడీ


చికిత్స పొందుతున్న వెంకటేశులు

నాగలాపురం : మండలంలోని బంగారునాయుడు కండ్రిగ వద్ద శనివారం రాత్రి ఓ వ్యక్తిపై ఇద్దరు దుండగులు దాడి చేసి రెండు గ్రాముల బంగారు ఉంగరం, రూ.25వేల విలువైన సెల్‌ఫోన్‌ను దోచుకున్నారు. వివరాలు.. పిచ్చాటూరు మండలం అప్పలరాజు కండ్రిగకు చెందిన వెంకటేశులు తమిళనాడులోని ఊత్తుకోటలో ఉన్న హోటల్‌లో పనిచేస్తున్నాడు. శనివారం రాత్రి విధులు ముగించుకుని ద్విచక్రవాహనంలో స్వగ్రామానికి వస్తుండగా మాస్కులు ధరించిన ఇద్దరు వ్యక్తులు అడ్డుకున్నారు. ఇనుప రాడ్లతో దాడి చేసి గాయపరిచారు. వెంకటేశులు సొత్తును దోచుకున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. బాధితుడు ప్రస్తుతం సత్యవేడు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

నీడలో వాహనాలు.. ఎండలో భక్తులు


భక్తుల కోసం ఏర్పాటు చేసిన షెడ్లలో పార్క్ చేసిన వాహనాలు

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తీశ్వరాలయ అధికారుల తీరు మారలేదు. భక్తుల కోసం ఏర్పాటు చేసిన షెడ్ల కింద వాహనాలు పార్కింగ్ చేస్తుంటే పట్టించుకోవడం లేదు. దీంతో భక్తులు ఎండలో రోడ్లపై నడవాల్సి వస్తోంది. రూ.లక్షల వ్యయంతో షెడ్లు ఏర్పాటు చేస్తే, అందులో వాహనాలు పార్క్ చేయడంపై భక్తులు మండిపడుతున్నారు. దీనిపై హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. అప్పటికీ ఎవరైనా వాహనాలను పార్క్ చేస్తే జరిమానా విధించాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు కారు పార్కింగ్ కాంట్రాక్టర్లు సైతం చొరవ తీసుకోవాలని సూచిస్తున్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలు


బస్సు కింద ద్విచక్రవాహనం

చిల్లకూరు: గూడూరు మండలం చెన్నూరు సమీపంలో ఆదివారం రాత్రి ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ద్విచక్ర వానదారుడికి తీవ్ర గాయాలయ్యాయి. రూరల్ పోలీసుల కథనం మేరకు తిప్పవరప్పాడు గ్రామానికి చెందిన వ్యక్తి చెన్నూరుకు వచ్చి పని ముగించుకుని ఇంటికి తిరిగి బయల్దేరారు. గూడూరు డిపోకి చెందిన ఆర్టీసీ బస్సు మలుపు వద్ద ఎదురుగా ఢీ కొనడంతో అతనికి తీవ్రగాయాలయ్యాయి. స్పందించిన స్థానికులు అతనిని గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

అక్రమంగా విక్రయిస్తున్న బాణసంచా సీజ్


బాణసంచాను స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు

నాగలాపురం : స్థానిక బ్రాహ్మణవీధిలోని ఓ ఇంట్లో అక్రమంగా బాణసంచా విక్రయిస్తున్న వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఆదివారం ఈ మేరకు ఎస్ఐ సునీల్ తన సిబ్బందితో కలిసి దాడి చేసి రూ.లక్ష విలువైన బాణసంచా సీజ్ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా బాణసంచా అమ్ముతున్న ఇక్బాల్(65)పై కేసు నమోదు చేశారు. అనుమతి లేకుండా బాణసంచా అమ్మితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. దాడితో కానిస్టేబుళ్లు సాయికిరణ్, భూపతి, కృష్ణ, దివాకర్ పాల్గొన్నారు.

దేవుడికే శఠగోపం!

- మామండూరులో కాటమరాజు మాన్యం కబ్జా
- జాతీయ రహదారి పక్కన చిన్న దుకాణం ఏర్పాటు చేసి, ఆపై చదును చేస్తున్న వైనం
- సీఎం బంధువులు కావడంతో చర్యలకు వెనుకడుగు వేస్తున్న అధికారులు


దేవుడి మాన్యం భూమిలో అక్రమంగా దుకాణం ఏర్పాటు చేసిన సీఎం చంద్రబాబు సమీప బంధువు

సాక్షి, టాస్క్‌ఫోర్స్: చంద్రగిరి మండలం, మామండూరు పరిధిలోని దేవుడు మాన్యాన్ని కాజేసేందుకు స్కెచ్ వేశారు. జాతీయ రహదారి విస్తరణలో భాగంగా ఈ భూమికి విపరీతమైన ధర పలుకుతోంది. ప్రస్తుతం ఈ భూమి విలువ రూ.10 కోట్ల పైమాటే. సీఎం చంద్రబాబు సమీప బంధువు కావడంతో అధికారులు మౌనం వహిస్తున్నారు. గ్రామస్తులు వివరాల మేరకు.. మండల పరిధిలోని పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారికి అనుకుని మామండూరు గ్రామ సమీపంలో సర్వే నం .91/1లో సుమారు 0.83 సెంట్ల గుడిమాన్యం పోరంబోకు ఉంది. రహదారి విస్తరణ చెందడంతో ప్రస్తుతం ఆ భూమి ధర రూ.10 కోట్లకు పైమాటేనని స్థానికులు చెబుతున్నారు.

కబ్జాకు స్కెచ్ వేసిన సీఎం సమీప బంధువు

ఆ దేవుడు మాన్యం భూమిపై అదే గ్రామానికి చెందిన సీఎం చంద్రబాబు సమీప బంధువు కన్నుపడింది. ఎలాగైనా కబ్జా చేయాలని పథకం పన్నాడు. నాలుగు రోజుల క్రితం ఆ భూమిలో చిన్నపాటి రేకుల షెడ్ ఏర్పాటు చేశారు. ఆపై దుకాణం వెనుక వైపు ఉన్న భూమిని చదును చేయడం ప్రారంభించాడు. తరతరాలుగా దేవుడు మాన్యాన్ని కబ్జాకు గురికాకుండా కాపాడుకుంటూ వస్తున్నట్లుగా గ్రామస్తులు తెలిపారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో దేవుడు మాన్యాన్ని హస్తగతం చేసుకోవడానికి యత్నిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

చర్యలెక్కడ

దేవుడు మాన్యాన్ని కాపాడాలని గ్రామస్తులు దేవదాయ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినట్లుగా గ్రామస్తులు చెబుతున్నారు. ఆ భూమిలో అనధికారికంగా దుకాణాన్ని ఏర్పాటు చేసి, ఆపై ప్లాట్లను ఏర్పాటు చేసి విక్రయించేందుకు యత్నిస్తున్నట్లుగా ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. అయితే దేవదాయ శాఖ అధికారులు కబ్జారాయుళ్లపై చర్యలు తీసుకోవడానికి వెనుకడుగు వేస్తున్నారని ఆరోపిస్తునానరు. ఇప్పటికై నా అధికారులు స్పందించాల్సి ఉంది.

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
స్ట్రెస్డ్ అస్సెట్స్ రికవరీ బ్రాంచి,
డోర్ నెం. 54-20-1B/3F/U6, 3వ అంతస్తు, తెఫెపి మేడపీద, సూర్య ప్రకాష్ ప్యాలెస్, గురునానక్ నగర్ రోడ్డు, విజయవాడ-520008, ఎన్.టి.ఆర్.జిల్లా, ఆంధ్రప్రదేశ్. ఫోన్: 0866-2546922. ఇ-మెయిల్ : sbi.64267@sbi.co.in

ఇ-వేలం ద్వారా వాహనము అమ్మకం

1) ఋణగ్రహీత పేరు : శ్రీ పిడుగు గోపి, తండ్రి పి. కాటయ్య, 2-21, బ్రహ్మణపల్లి గ్రామము & పోస్ట్, కె వి బి పురం మండలం, తిరుపతి – 517 643.

క్ర.సం.	వాహనము నెం.	కంపెనీ / ఫ్యూయల్	మోడల్ / కలర్	రిజర్వు ధర	ధరావత్తు
1	AP39UJ7670	EICHER 6016 N CWC BS6 OMNIBUS / DIESEL	2022/ Saloon/Blue and White	Rs. 11,75,000/-	Rs. 1,17,500/-
2	AP39UJ7671	EICHER 6016 N CWC BS6 OMNIBUS / DIESEL	2022/ Saloon/Blue and White	Rs. 11,75,000/-	Rs. 1,17,500/-

2) ఋణగ్రహీత పేరు : శ్రీ జగడం హరి బాబు, తండ్రి జగడం సుబ్రహ్మణ్యం, 3-133, కల్లపూడి గ్రామము, కొప్పూరు పోస్ట్, కె వి బి పురం మండలం, తిరుపతి – 517 643.

క్ర.సం.	వాహనము నెం.	కంపెనీ / ఫ్యూయల్	మోడల్ / కలర్	రిజర్వు ధర	ధరావత్తు
1	AP39UK 2473	EICHER 6016 N CWC BS6 OMNIBUS / DIESEL	2022/ Saloon/Blue and White	Rs. 11,75,000/-	Rs. 1,17,500/-
2	AP39UK 2474	EICHER 6016 N CWC BS6 OMNIBUS / DIESEL	2022/ Saloon/Blue and White	Rs. 11,75,000/-	Rs. 1,17,500/-

ఇ-వేలం తేది మరియు సమయం : 23-10-2025, ఉ॥ 11.00 గం॥ నుండి సా॥ 04-00 గం॥ వరకు
బిడ్ పెంపుదల : బిడ్డర్స్ వారి ఆఫర్ ధరలను రూ. 10,000/-ల గుణింపులో హెచ్చించవలెను.

నియమ నిబంధనలు : 1) వాహనమును "ఎక్కడ ఎలా వున్నది అక్కడ అలాగే" మరియు "ఎక్కడ ఏమున్నదో అదే" అను పద్ధతిలో వేలం వేయబడును. 2) రిజర్వు ధరకన్నా తక్కువ ధరకు వాహనము అమ్మబడదు. 3) విజయవంతమైన పాటదారుడు అంగీకరించిన అమ్మకపు ధరలో కనీసం (10+15) 25% తక్షణమే చెల్లించవలెను. మిగిలిన సొమ్మును 15 రోజులలోపు చెల్లించని పక్షంలో ఎటువంటి నోటీసు లేకుండా అప్పటి వరకు చెల్లించిన మొత్తమును కోల్పోవుదురు. 4) ఐడెంటిఫికేషన్ రుజువు (కెవైసి) అనగా స్వయం ధృవీకరణతో ఆధార్ కార్డు/ఓటరు ఐడి కార్డు/డ్రైవింగ్ లైసెన్సు/పాస్‌పోర్ట్ వగైరా కాపీ అవసరమగును. [illegible] 5) నిబంధనల ప్రకారం GST & TCS పన్నులు వర్తిస్తాయి. 6) ఎటువంటి కారణం చూపకుండానే వేలం వాయిదా వేయుటకు, రద్దు చేయుటకు బ్యాంకు వారికి అధికారం కలదు. 7) తేది. 06-10-2025 నుండి 22-10-2025 వరకు బ్యాంక్ పనివేళలలో వాహనమును తనిఖీ చేసుకోగలరు. వాహనము తనిఖీ కొరకు సంప్రదించవలసిన నెంబర్లు : 99204 59242 & 89784 80704. 8) అమ్మకం యొక్క సవివరమైన నియమ నిబంధనల కొరకు, సెక్యూర్డ్ క్రెడిటార్స్ అయిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా యొక్క వెబ్‌సైట్ : www.sbi.co.in/web/sbi-in-the-news/auction-noticesలో ఏర్పాటుచేసిన లింకును క్లిక్ చేయండి. [illegible] ఇ-ఆక్షన్ పోర్టల్ : https://baanknet.com/eauction-psb/bidder & https://baanknet.com టోల్ ఫ్రీ ఫోన్ నెం.: +91 - 8291220220, ఇ-మెయిల్ : support. baanknet@psballiance.com ను సంప్రదించండి.

తేది : 04-10-2025, ప్రదేశం : విజయవాడ — సం/- అధీకృత అధికారి, SBI, SARB, విజయవాడ

సాక్షి క్లాసిఫైడ్స్

Wanted

APSRTC రాయచోటిలో అవుట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేయుటకుITI Diesel Mechanic అభ్యర్థులు కావలెను.అన్ని రకాల ప్రభుత్వ కంట్రాక్ట్ ఉద్యోగాలకు సంప్ర.9849848817, 9121278009.

కన్సల్టెన్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు, ఆయా, నర్సులు, వంటవారు, RMP & డ్రైవర్స్ కావలెను. జీ. 15 వేలు - 40వేలు, ఫ్రీ రూం+భోజనం. Hyd. 7993583999

నాలుగులైన్ల ప్రకటనకు : రూ. 375/-
అదనపు లైనుకు : రూ . 90/-
ప్రతి ప్రకటనపై G.S.T 5% అదనం
Contact 9705444178 9951602970

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రత్యుత్తరమివ్వాల్సిందిగా మా పాఠకులకు కోరడమైనది. ప్రకటనదారు చేసిన లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తాపత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బుల ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.